సమాచారం

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: గచ్చిబౌలి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ పీవీబీ వేణుగోపాల్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సాయిఐశ్వర్యకాలనీ, సాయివైభవ్‌కాలనీ, ఖాజాగూడ, గణశ్యామ్ సూపర్‌మార్కెట్, నిహారికా కన్‌స్ట్రక్షన్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

ఖాజాగూడ ఫీడర్ పరిధిలో..

ఖాజాగూడ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంతో మంగళవారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాయిఐశ్వర్యకాలనీ, సాయివైభవ్‌కాలనీ, జైన్ కన్‌స్ట్రక్షన్స్, ఖాజాగూడ, ఖాజాగూడ వీకర్ సెక్షన్స్ కాలనీ, సాయికృపకాలనీ, నిహారికా కన్‌స్ట్రక్షన్స్, కరాచీ బేకరీ ప్రధాన రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ఆదిత్యనగర్ ఫీడర్ పరిధిలో..

హఫీజ్‌పేట్: ఆదిత్యనగర్ 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్న అధికారులు తెలిపారు. ఉ 9.30 నుంచి మ.ఒంటిగంట వరకు ఆదిత్యనగర్, సుభాష్‌చంద్రబోస్‌నగర్, కృష్ణకాలనీ, హఫీజ్‌పేట్ ఫ్లై ఓవర్‌రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు, వినియోగదారులు గమనించాలని ఆయన వివరించారు. మార్తాండనగర్ 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు మార్తాండనగర్, ప్రేమ్‌నగర్ ప్రధాన రోడ్డు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు వారు వివరించారు.

23 నుంచి 'మనూ'లో అంతర్జాతీయ సెమినార్

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ ఉర్దూ కల్చర్ స్టడీస్(సీయూసీఎస్), ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రీసెర్ విద్యా మంత్రిత్వశాఖ సంయుక్త ఆధ్వర్యంలో డెక్కన్ సూఫీల మూడు రోజుల అంతర్జాతీయ సెమినార్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. జనవరి 23 నుంచి 25వ తేదీ వరకు మత సామరస్య ప్రమోషన్ కోసం సూఫీల సహకారంపై ఈ సెమినార్‌ను నిర్వహిస్తారు. క్యాంపస్‌లోని సయ్యద్ హమీద్ లైబ్రేరీ ఆడిటోరియంలో ఉదయం 10.30 గంటలకు ఈ సెమినార్‌ను వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్ అధ్యక్షతన నిర్వహిస్తారు. గౌరవ అతిథిగా ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ కాన్సుల్ జనరల్ అక్మైమహదీ షారోఖీ, హైదరాబాద్‌లోని హెన్రీ మార్టిన్ ఇన్‌స్టిట్యూట్ రెవరెండ్ డాక్టర్ ప్యాకియం టి శామ్యూల్, సీయూసీఎస్, సెమినార్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్‌ఎం అజీజుద్దీన్‌హుస్సేన్, సెమినార్ కన్వీనర్ డాక్టర్ అహ్మద్‌ఖాన్ పాల్గొంటారు.

దుస్తుల పంపిణీ



హఫీజ్‌పేట్: సంక్రాంతిని పురస్కరించుకొని సోమవారం కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు కమ్యూనిటీహాల్‌లో మల్లంపాటి సుజాత మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో దుస్తులు, భోజన ఫలహారాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఆర్ ఫౌండేషన్ సభ్యులతో కలిసి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్‌లు కలిసి వృద్ధులకు అందజేశారు. ఈ సేవా కార్యక్రమం చేసిన ట్రస్ట్ వారికి సీఆర్ ఫౌండేషన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎంఎస్‌ఎంసిటీ చైర్మన్ వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ ప్రేమ్‌సాగర్, ట్రస్టీ కిషోర్, సీఆర్ ఫౌండేషన్ కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వరరావు, ట్రెజరర్ చెన్న కేశవరావు, హెల్త్ సెంటర్ డైరెక్టర్ డా.రజిని, తుకారం, సరస్వతి, రాజేంద్రరావు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జి బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు బండ్లగూడ జీఆర్‌కే గార్డెన్‌లో ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. శంషాబాద్, రాజేంద్రనగర్, గండిపేట మండలాలకు చెందిన పార్టీ ముఖ్య నాయకులంతా సమావేశానికి హాజరుకావాలని కోరారు.

క్రికెట్ టికెట్ల విక్రయాలు షురూ

- గచ్చిబౌలి స్టేడియంలో సందడిలేని వాతావరణం
- విక్రయానికి భారీగా ఏర్పాట్లు
- రోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 వరకు విక్రయాలు..
- మ్యాచ్ రోజు వరకు విక్రయాలు కొనసాగింపు
- ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకున్న వారు ఆధార్‌కార్డు తీసుకొస్తేనే టికెట్..



గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలోకి టికెట్ల కోసం వస్తున్న క్రికెట్ అభిమానులు

హఫీజ్‌పేట్: నగరంలో క్రికెట్ సందడి మొదలైంది. బుధవారం ఇండియా–న్యూజిలాండ్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ కొనసాగుతుండడంతో క్రికెట్ అభిమానుల టికెట్ల కోసం బారులు తీరి నిల్చున్న దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదు. కౌంటర్ల సంఖ్య పెంచినా రద్దీ లేని వాతావరణంలో టికెట్ల అందజేత సాఫీగా కొనసాగుతోంది. నిర్వాహకులు, క్రికెట్ అభిమానులు ముఖ్యంగా పోలీసులకు ఎలాంటి సమస్యలు లేకుండా పోయాయి. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియాన్ని టికెట్ల విక్రయం కోసం ఎంపిక చేశారు. టికెట్ల విక్రయానికి పేటీఎం వారు గచ్చిబౌలి స్టేడియంలో భారీగా ఏర్పాట్లు చేశారు. అభిమానులకు గత మ్యాచ్ సందర్భంగా ఎదుర్కొన్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, పేటీఎం వారు సంయుక్తంగా ఈ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ముఖ్యంగా ఆన్‌లైన్‌లో టికెట్లను బుక్ చేసుకున్న వారికి మాత్రమే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్ల ద్వారా టికెట్లను అందించాలని నిర్ణయించడంతో ఎలాంటి సమస్యలు లేకుండా సాధాసీదాగా టికెట్ల అందజేత కార్యక్రమం సాగుతోంది. ఎలాంటి సందడి లేకుండా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారు ఆధార్‌కార్డు తీసుకొచ్చి తమ టికెట్లను పొందుతూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



టికెట్ల విక్రయానికి వినియోగాదారులు లైన్‌లో నిల్చొనేందుకు ఏర్పాటు చేసిన దృశ్యం



క్రికెట్ మ్యాచ్ టికెట్లను కౌంటర్ల ద్వారా పొందుతున్న క్రికెట్ అభిమానులు

టికెట్ల విక్రయ వివరాలు...

- గచ్చిబౌలి స్టేడియంలో ప్రతిరోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విక్రయాలు.
- ఆన్‌లైన్‌లో టికెట్లను బుక్ చేసుకున్నవారిలో ఆధార్‌కార్డు తీసుకొచ్చిన వారికి అందజేత
- ఈనెల 18వ తేదీ మ్యాచ్ రోజు వరకు ఈ టికెట్ల విక్రయాల కొనసాగింపు.
- టికెట్ల విక్రయం కోసం ప్రత్యేకంగా 8 కౌంటర్ల ఏర్పాటు.
- కౌంటర్ల వద్ద బారులు తీరి నిల్చునేలా బారికేడ్ల ఏర్పాటు.
- రెండు రోజుల్లో 7వేల టికెట్ల విక్రయం.
- ఆదివారం రోజు 5వేల మందికి టికెట్ల అందజేత.
- సోమవారం 2వేల టికెట్ల అందజేత.
- ప్రతిరోజూ సాయంత్రం 5 గంటల వరకు సైట్ ఓపెన్‌గా ఉంటుంది. అందులో టికెట్లను బుక్ చేసుకున్న వారికి మరుసటిరోజు టికెట్లను ఈ కౌంటర్ ద్వారా అందజేత.

చాలా సంతోషంగా ఉంది...



నేను మల్కాజ్‌గిరి నుంచి వచ్చా. ఎల్‌బి స్టేడియంలో టికెట్లు తీసుకోవడానికి ప్రయత్నించా. కానీ లింక్ ఓపెన్ కాలేదు. అందుకే గచ్చిబౌలి స్టేడియంకు వచ్చి టికెట్లు తీసుకున్నందుకు ఆనందంగా ఉంది. గత ఏడాది మ్యాచ్ టికెట్ల కోసం తీవ్ర ఇబ్బందిపడ్డాం కానీ ఇప్పుడు ఎలాంటి ఇబ్బంది లేకుండా టికెట్లు తీసుకోవడం చాలా సంతోషంగా ఉంది.

– డాక్టర్ విజయ్, మల్కాజ్‌గిరి

ఇబ్బందులు లేకుండా టికెట్లు దొరికాయి..



భారత్, న్యూజిలాండ్ మ్యాచ్ టికెట్ల కోసం ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆన్‌లైన్ ద్వారా టికెట్ల విక్రయించడం చాలా సులభంగా ఉంది. ఎలాంటి ఇబ్బందులు లేకుండా గచ్చిబౌలి స్టేడియంకి వచ్చి టికెట్లు తీసుకోవడం ఆనందంగా ఉంది. క్రమబద్ధమైన ఏర్పాట్లు చేయడంతో ఎలాంటి ఇబ్బందులు కలగలేదు.

– శ్రవణ్, ఫొటోగ్రఫర్, జూబ్లీహిల్స్

మహబూబ్‌నగర్ నుంచి వచ్చాం....

మహబూబ్‌నగర్ నుంచి నలుగురు స్నేహితులతో కలిసి గచ్చిబౌలికి టికెట్ల కోసం వచ్చాం. హైదరాబాద్‌లో జరిగే ప్రతి మ్యాచ్ తిలకించడానికి స్నేహితులతో కలిసి వస్తుంటా. పూర్తిగా ఆన్‌లైన్ ద్వారా టికెట్లు అమ్మడం ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నందుకు సంతోషిస్తున్నా. గత మ్యాచ్ టికెట్ల కోసం చాలా ఇబ్బందులకు గురై టికెట్లు కొనుగోలు చేశాం. ఇప్పుడు ఆన్‌లైన్ ద్వారా టికెట్లు పొందడం చాలా సులభంగా, సునాయసంగా ఉంది.

– రవి ప్రకాష్, ప్రైవేట్ ఉద్యోగి, మహబూబ్‌నగర్

కాలనీల్లో కమ్యూనిటీతో కలిసి పోలీసుల రాత్రి గస్తీ



స్థానిక యువతతో కలిసి సైకిళ్లపై గస్తీని నిర్వహిస్తున్న దృశ్యం

రాయదుర్గం: కాలనీలు, బస్తీల్లో దొంగతనాలు చోటు చేసుకోకుండా కమ్యూనిటీని భాగస్వాములు చేయడానికి పోలీసులు ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం రాత్రి రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని మధురానగర్, గచ్చిబౌలి, టెలికామ్‌నగర్, ఖాజాగూడ, జయభేరి పైన్‌వ్యాలీ, ప్రశాంత్‌హిల్స్, ల్యాంకో హిల్స్ రోడ్ మణికొండ, పంచవటికాలనీ, హనుమాన్‌నగర్, గంగోత్రి స్కూల్ లేన్, చిత్రపురిహిల్స్, టింబర్‌లేక్‌కాలనీవంటి ప్రాంతాల్లో పోలీసుల రాత్రి గస్తీని సైకిళ్లపై తిరుగుతూ పోలీసులు, స్థానికులు పర్యటించారు. మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి నాయకత్వం, రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ ఎం. మహేష్ ఆధ్వర్యంలో పోలీసులు, కమ్యూనిటీ వలంటీర్లతో కలిసి సైక్లింగ్‌ను నిర్వహించారు. సైకిళ్లపై పెట్రోలింగ్ కార్యక్రమాన్ని గచ్చిబౌలి డివిజన్‌లోని లేక్‌కాలనీ, మధురానగర్ ప్రాంతాల్లో అర్ధరాత్రి అనుమానాస్పదంగా సంచరిచే అనుమానితులను గుర్తించి వాహనాన్ని తనిఖీ చేసి, ఆస్తి అక్రమాలను అరికట్టేందుకు సంక్రాంతి పండుగ సమయం దృష్ట్యా పెట్రోలింగ్‌ను నిర్వహించారు. ఈ సైకిల్‌పై పెట్రోలింగ్ కార్యక్రమంలో కమ్యూనిటీ నుంచి జనార్దన్, ప్రతాప్, చైతన్య, వంశీ, తేజేంద్ర, మంజునాథ్, మహేష్, సందీప్, శ్రీచరణ్, అనిమేష్ సైకిల్‌పై పెట్రోలింగ్‌లో పోలీసులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి మాట్లాడుతూ.. సైక్లింగ్ కమ్యూనిటీ పోలీసులతో కలిసి హైదరాబాద్ నగరంలో అద్భుతాలు చేయగలమని పోలీసులు నిరూపించారన్నారు.

మారుమూల ప్రజలకు సాంకేతికతను అందించాలి



వర్క్‌షాప్‌లో పాల్గొన్న వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బీజేరావును సత్కరించిన దృశ్యం

రాయదుర్గం: మనదేశంలోని మారుమూల ప్రజలకు సాంకేతికతను మరింతగా అందించాల్సిన అవసరం ఉందని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బీజేరావు అభిప్రాయపడ్డారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌లో సోమవారం నుంచి 22వ తేదీ వరకు డీఎస్‌టీ–ఎస్‌టీయూటీఐ ఆధ్వర్యంలో సాగే 'బయో మెడికల్ రీసెర్చ్‌లో అధునాతన పద్ధతులు' అనే అంశంపై నిర్వహించే వర్క్‌షాప్‌లో ఆయన సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరికీ చేరువలోకి ప్రతి పరిశోధనా అంశాన్ని చేరేలా చేయాల్సిన అవసరం కూడా ఉందన్నారు. వర్క్‌షాప్‌ల నిర్వహణతోపాటు ఇందులోని అంశాలను ప్రజలకు కూడా చేరేలా చేయాలన్నారు. 'పాపులేషన్ జెనోమిక్స్ అండ్ పబ్లిక్ హెల్త్'అనే అంశంపై డాక్టర్ కె తంగరాజ్ మాట్లాడుతూ.. భారతదేశంలోని మానవ జనాభా చరిత్రపై అంతర్‌దృష్టులను అందించారు. సైన్స్ అండ్ మెజర్మెంట్స్–ప్రయోగాత్మక రూపకల్పన అనే అంశంపై విశిష్ట జీవశాస్త్రవేత్త ప్రొఫెసర్ కె మురళీధర్, 'ప్రస్తుత ఎన్‌జీఎస్ ఆధారిత పరీక్షలకు దారితీసే జన్యు పరీక్షల పరిణామం'అనే అంశంపై కామినేని మెడికల్ కాలేజి జెనెటిక్స్ అండ్ మాలిక్యులర్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ క్యూ అన్నీ హసన్ ప్రసంగించారు. అనంతరం ప్రొఫెసర్ సుహెల్‌పర్వేజ్, వర్క్‌షాప్ కన్వీనర్ ప్రొఫెసర్ పి ప్రకాశ్‌బాబు, కో కన్వీనర్లు ప్రొఫెసర్ సంతోష్ ఆర్ కన్నాడే, డాక్టర్ ఎంకె అనుణశ్రీ, డాక్టర్ సంతోష్‌కుమార్‌పాధి ప్రసంగించారు.

సత్తాచాటిన ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ స్మార్ట్ సిటీ బృందం



బెస్ట్ టెక్ అవార్డు సాధించినది వీరే..

రాయదుర్గం: ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ స్మార్ట్ సిటీ బృందం సత్తా చాటింది. 2023 సంవత్సరంలో మొదటి అంతర్జాతీయ అవార్డును పొందడం విశేషం. ఓపెన్ సోర్స్ వన్ ఎం2ఎం ప్లాట్‌ఫారమ్‌లలో ఒకదానిని ఉపయోగించి పరిష్కారాలను ప్రోత్సహించడం వార్షిక హ్యాకథాన్ లక్ష్యం. దక్షిణ కొరియాలోని సైన్స్ ఐసీటీ మంత్రిత్వ శాఖతో పాటు టెలికమ్యూనికేషన్స్ టెక్నాలజీ అసోసియేషన్ (టీటీఏ), యూరోపియన్ టెలికమ్యూనికేషన్స్ స్టాండర్డ్స్ ఇన్‌స్టిట్యూట్(ఈటీఎస్‌ఐ) సహకారంతో కొరియన్ ఎలక్ట్రానిక్స్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్(కెఈటీఐ) నిర్వహించిన 8 వారాల అంతర్జాతీయ ఆన్‌లైన్ హ్యాకథాన్ ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ స్మార్ట్ సిటీ లివింగ్ ల్యాబ్ స్ట్రీట్ లైట్ ఆటోమేషన్ ప్రాజెక్టు టెలికమ్యూనికేషన్స్ విభాగంలో బెస్ట్ టెక్నాలజీ అవార్డును సాధించింది. 'టీమ్ ఎథీనా'విన్నింగ్ ప్రాజెక్టు మొత్తం 12 విశ్వవిద్యాలయ బృందాలు హ్యాకథాన్‌లో పాల్గొన్నాయి. వాటిలో రెండు ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌లోని స్మార్ట్ సిటీ లివింగ్ ల్యాబ్‌కు చెందినవి కావడం విశేషం. వైభవ్ నవేర్ ఆధ్వర్యంలో ఎథీనా బృందంలో ప్రశాంత్ నందిపాటి, రాకేష్ హోట్కర్, సుధాకొల్లిమర్ల ఉన్నారు.

22న శ్రీవీరభద్రస్వామి కల్యాణ మహోత్సవం



కూకట్‌పల్లి: మూసాపేటలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో సప్పిడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. శ్రీ వీరభద్రస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీ ఆదివారం కాచిగూడ, మున్నూరు కాపు భవన్‌లో శ్రీ వీరభద్రస్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సేవా సమితి సభ్యుడు షాబాద్ వెంకటేశం అధ్యక్షుడు, కాసుల వినోద్ ప్రధాన కార్యదర్శి పాల్గొని కల్యాణ మహోత్సవ ఆహ్వానపత్రికలను స్వామివారి పాదాల చెంత ఉంచి పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు తూము నర్సింగరావు, ప్రధాన కార్యదర్శి జిల్లా జీత్‌రావు, తెలంగాణ మున్నూరు కాపు జర్నలిస్టు ఫోరం రంగారెడ్డి జిల్లా కన్వీనర్ తేళ్ల హరికృష్ణ, పద్మయ్య, వినోద్, శైలేష్, సంతోష్, కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

పిడియాట్రిక్ వెంటిలేటర్ అందజేత

ఆల్విన్‌కాలనీ: రాందేవ్‌రావు ఆసుపత్రి అందిస్తున్న ఉచిత సేవలను పలువురు కొనియాడారు. కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని వివేకానందనగర్ ప్రాంతంలో రాందేవ్‌రావు ట్రస్ట్ తరపున ఆసుపత్రి నిర్వహిస్తున్నారు. ఈ ఆసుపత్రికి వచ్చే పేదలకు ఉచిత వైద్య సేవలు కూడా అందిస్తున్నారు. ఇది తెలుసుకున్న కెనరా బ్యాంక్ వారు కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద రూ.16 లక్షల విలువ గల పిడియాట్రిక్ వెంటిలేటర్‌ను సోమవారం కెన్ ఫైనాన్స్ హోమ్స్ లిమిటెడ్ నిర్వాహకులు విరాళంగా అందజేశారు. కెనరా బ్యాంక్ సహకారంతో పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా ఈ వెంటిలేటర్‌ను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాందేవ్‌రావు ఆసుపత్రి చైర్మన్ విక్రమ్ దేవ్‌రావు, ట్రస్ట్ సభ్యులు ప్రశాంత్‌రెడ్డి, గౌరవ కార్యదర్శి మీరారావు, మెడికల్ డైరెక్టర్ కమలాకర్, డిప్యూటి డైరెక్టర్ సూర్యవంశీ, సీఈఓ యోబు, బ్యాంక్ మేనేజర్ మోహనకృష్ణ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

యువతి అదృశ్యం



అర్చన

పటాన్‌చెరు టౌన్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రామనాయుడు కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామానికి చెందిన అంజనేయులు కూతురు అర్చన(25) ఎంఎస్‌సీ వరకు చదివి ఇంటి వద్దే ఉంటోంది. ఈ నెల 13వ తేదీన ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. ఫోన్‌ను సైతం ఇంట్లో వదిలి వెళ్లింది. దీంతో కూతురు అదృశ్యంపై తండ్రి అంజనేయులు సోమవారం ఫిర్యాదు చేయగా ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పాల ప్యాకెట్‌కు వెళ్లిన యువతి..



సౌందర్య

పటాన్‌చెరు టౌన్: ఇంటి నుంచి పాల ప్యాకెట్ కోసం వెళ్లి ఓ యువతి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ప్రసాద్‌రావు కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండల పరిధిలోని ఇంద్రేశం గ్రామానికి చెందిన బుచ్చయ్య రెండో కూతురు సౌందర్య(26) పదో తరగతి వరకు చదివి ఇంటి వద్దే ఉంటోంది. ఈ క్రమంలో 15వ తేదీన సాయంత్రం ఇంటి నుంచి పాల ప్యాకెట్ కోసం బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద ఎంత వెతికినా ఆచుకీ లభించలేదు. ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో కూతురు అదృశ్యంపై తండ్రి బుచ్చయ్య సోమవారం ఫిర్యాదు చేయగా, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక సాయం

జిన్నారం(పటాన్‌చెరు): వీరన్నగూడకి చెందిన మోహన్ కుటుంబానికి సోమవారం రూ. 20వేల ఆర్థిక సాయాన్ని చిట్కుల్ సర్పంచ్ నీలంమధు అందించారు. మృతుడి కుటుంబ సభ్యులు చిట్కుల్ సర్పంచ్ నీలం మధుకు కృతజ్ఞతలు చెప్పారు.

పటాన్‌చెరు: గత నెల అనారోగ్యంతో ఏషియన్ పెయింట్స్ హమాలీ కార్మికుడు కిషన్ నాయక్ మృతిచెందాడు. మృతుడి కుటుంబానికి ఏషియన్ పెయింట్స్ ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహా రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం రూ.41,500లు అందజేశారు. ఈ కార్యక్రమంలో హమాలీ కార్మిక సంఘం నాయకులు మల్లేష్, రతన్ సింగ్, విజయ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బంగ్లాపై నుంచి జారి పడి వ్యక్తి మృతి

గచ్చిబౌలి: బంగ్లాపై నుంచి ప్రమాదవశాత్తు జారి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ సురేష్ కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని గంగవరం గ్రామానికి చెందిన గుడినర్వ ఊషన్న(55) నగరానికి వచ్చి వట్టినాగులపల్లిలోని వివేకానందనగర్‌లో ఐరన్‌షాప్‌ను నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. తన భవనంలోని పైభాగంలోని రెండో ఫ్లోర్‌పై ఉన్న ట్యాంకుపై నీరు నిండిందో లేదో చూడటానికి సోమవారం తెల్లవారుజామున 3.40 గంటలకు వెళ్లాడు. చూసి తిరిగి కిందకు వచ్చే సమయంలో చిక్కుడు చెట్టు తీగలు తట్టుకొని కింద ఉన్న సీసీరోడ్డుపై పడిపోయాడు, దీంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పడుకున్న చోటే ..



కన్‌హే మృతదేహం

పటాన్‌చెరు టౌన్: పడుకున్న చోటే ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ప్రసాద్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌లోని గోరక్‌పూర్‌కు చెందిన రామచంద్ర అతడి సోదరుడు కన్‌హే(42) నాలుగేళ్ల క్రితం పటాన్‌చెరు పారిశ్రామికవాడలోని రూసత్ టింబర్ డిపోలో పని చేసుకుంటూ అక్కడే ఉంటున్నారు. అయితే కన్‌హే గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో 14వ తేదీన రాత్రి భోజనం చేసిన తర్వాత వాంతులు చేసుకున్నాడు. దీంతో సోదరుడు శుభ్రం చేయించి పడుకోబెట్టాడు. తిరిగి 15వ తేదీన ఉదయం కన్‌హేను నిద్ర లేపేందుకు చూడగా, ఎంత లేపినా లేవలేదు. పరిశీలించి చూడగా మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు రామచంద్ర తన తమ్ముడు మృతిపై ఎలాంటి అనుమానం లేదని, గుండెపోటులో మృతిచెంది ఉండవచ్చని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పతంగి ప్రాణం తీసింది

బైక్ ఢీకొని బాలుడి మృతి



రోహిత్ మృతదేహం

పటాన్‌చెరు టౌన్: తెగిపోయిన గాలిపటాన్ని పట్టుకోవడానికి తొమ్మిదేళ్ల బాలుడు జాతీయ రహదారిపై పరుగులు తీశాడు...అదే చివరి పరుగు అయ్యింది. ఈ దుర్ఘటన ఆదివారం పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ దుర్గయ్య కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముస్తాక్ కుటుంబం బతుకుదెరువు కోసం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌నకు వచ్చి అక్కడే గుడిసెల్లో నివాసం ఉంటోంది. అతనికి భార్య, ముగ్గురు పిల్లలు. సంక్రాంతి పండగను పురస్కరించుకొని రెండో కుమారుడు రోహిత్(9) ఇస్నాపూర్ నుంచి రహదారి వెంబడి ఎగురుతున్న గాలిపటాలను చూసుకుంటూ పటాన్‌చెరు నోవాపాన్ చౌరస్తా వరకు వచ్చాడు. అక్కడ తెగివస్తున్న గాలిపటాన్ని చూస్తూ రోడ్డుపై వస్తున్న వాహనాలను గమనించకుండా వేగంగా దాటబోయాడు. ఈలోగా ఇస్నాపూర్ నుంచి వస్తున్న ద్విచక్ర వాహనదారుడు బాలుడు రోహిత్‌ను బలంగా ఢీకొట్టాడు. తీవ్ర గాయాలపాలైన బాలుడిని పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు.

శిల్పారామం.. సందర్శకుల మయం





మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో సంక్రాంతి సంబురాలలో సందర్శకులు సోమవారం కిటకిటలాడారు. పండుగ సందర్భంగా గంగిరెద్దుల విన్యాసాలు, బుడబుక్కలు, జంగమదేవరలు, హరిదాసులు, పిట్టలదొర, గారడీమాటలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. సంక్రాంతి సంబురాలలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. చంద్రశేఖర్ శిష్య బృందంచే శ్రీగోదాకల్యాణం, కూచిపూడి నృత్యరూపకం ఆకట్టుకుంది. కర్ణాటక రాష్ట్రం తుంకూర్ ప్రాంతం నుంచి ప్రముఖ భరతనాట్య గురువులు డాక్టర్ సాగర్ శిష్యబృందంచే ప్రదర్శించిన భరతనాట్య అంశాలు అలరించాయి. ప్రముఖ నర్తకీమణి నేహాసింగ్ శిష్య బృందంచే ప్రదర్శించిన పలు నృత్యప్రదర్శనలు ప్రేక్షకులను అలరింపజేశాయి.

